క్లుప్తంగా

ఎంపీడీఓగా ప్రేమ్‌సాగర్



ఎంపీడీఓకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గ్రామ కార్యదర్శులు

ఏలేశ్వరం: మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఎం.ప్రేమ్‌సాగర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన అనకాపల్లి జిల్లా నుంచి పదోన్నతిపై రౌతులపూడి ఎంపీడీఓగా వచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏలేశ్వరం ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ ఎంపీడీఓగా పని చేస్తున్న సూర్యనారాయణ మండల విస్తరణాధికారిగా తిరిగి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ మండలాభివృద్ధికి తన వంతు కృషిచేస్తానన్నారు. గ్రామ కార్యదర్శులు ఎంపీడీఓను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

రైతులకు వరి విత్తనాల పంపిణీ



తూర్పులక్ష్మీపురంలో రైతులకు వరివిత్తనాలు అందజేస్తున్న నాయకులు

ఏలేశ్వరం: మండలంలోని తూర్పులక్ష్మీపురంలో రైతులకు బుధవారం సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. గ్రామంలోని ఆర్బీకే వద్ద ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి శివప్రసాద్ రైతులకు వరి విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు అవసరమైన వరి విత్తనాలు, గడ్డిమందును ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తోందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

గోకవరం: స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బ్రాంచి మేనేజర్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎల్ఐసీ సిబ్బంది, ఏజెంట్లకు పీఎంపీ వైద్యుడు చిన్నిబాబు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. అనంతరం యోగా చేయడం వలన కలిగే ప్రయోజనాలను సిబ్బందికి బ్రాంచ్ మేనేజర్ విద్యాసాగర్ వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ ఎలిపే శ్రీనివాస్, స్టాఫ్ యూనియన్ ప్రెసిడెంట్ చక్ర శ్రీను, ఏజెంట్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.నూకరాజు, సెక్రటరీ ఎస్.నాగరాజు, ఈసీ సభ్యుడు జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనుల పరిశీలన

శంఖవరం: మండల పరిధిలోని పలు పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కె.రాఘవేంద్ర సూచించారు. స్థానిక ఎంపీయూపీ స్కూల్‌లో జరుగుతున్న నాడు-నేడు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. నిబంధనలు పాటిస్తూ నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జేఈ తేజ, పాఠశాల హెచ్ఎం కె.వెంకటేశ్వరరావు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని మండపం గ్రామ సర్పంచ్ కూనిశెట్టి మాణిక్యం అన్నారు. మండలంలోని మండపంలో బుధవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు.

బీమా చెక్కు అందజేత

కిర్లంపూడి: మండలంలోని వీరవరం గ్రామానికి చెందిన రాజమండ్రపు శ్రీనివాస్ ఇటీవల శ్వాసకోశ వ్యాధితో మృతి చెందాడు. అతనికి వైఎస్సార్ బీమా పథకం ద్వారా మంజూరైన రూ.10 వేలను ఎంపీపీ తోట రవి మృతుడి భార్య మాధవికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అంబటి బుజ్జమ్మ, ఏఎంసీ డైరెక్టర్ తోట విష్ణు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంట కాలువలో పూడిక తొలగించాలని వినతి

ఏలేశ్వరం: పట్టణపరిధిలోని ప్రధాన పంట కాలువలో పేరుకుపోయిన పూడిక తొలగించాలని రైతులు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక నగర పంచాయతీ మేనేజర్ కె. శ్రీనివాసరావు, ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తిమ్మరాజుచెరువు పరిధిలో పట్టణానికి చెందిన సుమారు 600 ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. ఇటీవల కాలువను ఆనుకుని ఉన్న ఆక్రమణలు తొలగించడంతో కాలువ మూసుకుపోయి సాగునీరు ముందుకు పారడం లేదన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగు చేపట్టడంతో కాలువలో పూడిక తొలగించాలని కోరారు. రైతులు సామంతుల కృష్ణకిషోర్, ఆకుల గంగరాజు, పైల రామన్న, కర్రోతు సత్యనారాయణ, కోశా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చివరి మజిలీ సమస్యలకు చెక్

- అన్నవరం శ్మశానవాటిక నిర్మాణానికి స్థలం కేటాయింపు
- ఆదేశాలిచ్చిన జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా
- నేడు గ్రామస్తులతో సమావేశం



శ్మశానవాటికకు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలో హిందూ శ్మశానవాటిక ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 1.20 ఎకరాల స్థలం కేటాయించింది. ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ కృషి మేరకు పంపా రిజర్వాయర్‌ను ఆనుకుని ఆరెంపూడి పరిధిలో సర్వే నంబర్ 76లో 1.20 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఈ స్థలాన్ని రెవెన్యూ శాఖ ద్వారా గ్రామ పంచాయతీకి అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాలిచ్చినట్టు గ్రామ సర్పంచ్ శెట్టిబత్తుల కుమారరాజా బుధవారం తెలిపారు.

దహనసంస్కారాలకు ఇక్కట్లు

రాష్ట్రంలోనే పుణ్యక్షేత్రంగా పేరొందిన అన్నవరానికి ఇప్పటివరకూ సరైన శ్మశానవాటిక లేదు. గ్రామం ఏర్పడినప్పటి నుంచి పంపా కాలువ పక్కన గల స్థలాన్నే శ్మశానవాటికగా ఉపయోగిస్తున్నారు. వర్షాకాలంలోనూ, పంపా బ్యారేజీ నీటిని విడుదల చేసినప్పుడు అక్కడ దహనసంస్కారాలకు అవకాశం ఉండేది కాదు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు.

పిఠాపురంలో అంత్యక్రియలకు బ్రాహ్మణుల మొగ్గు

అన్నవరంలో దహన సంస్కారాలకు ఇబ్బందులు పడలేక బ్రాహ్మణులు పిఠాపురం శ్మశానవాటికను వినియోగిస్తున్నారు. తమ సామాజికవర్గంలో ఎవరైనా చనిపోతే పిఠాపురం తరలించి అక్కడే అంత్యక్రియలు చేస్తున్నారు. గత 25 సంవత్సరాలుగా హిందూ శ్మశానవాటిక కోసం ప్రయత్నాలు జరుగుతున్నా పెద్దగా పట్టించుకున్న నాథుడు లేడు. ప్రస్తుతం ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ చొరవతో శ్మశానవాటికకు స్థలం సమకూరడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

శ్మశానవాటిక నిర్మాణంపై చర్చించేందుకు...

హిందూ శ్మశానవాటిక నిర్మాణంపై చర్చించేందుకు స్థానిక సత్యగణపతి కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం నాలుగు గంటలకు గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ కుమార్ రాజా తెలిపారు. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. గ్రామంలోని అన్ని సామాజికవర్గాల ప్రజలు, దేవస్థానం ఉద్యోగులు, వ్యాపారులు, పెన్షనర్స్, లయిన్స్ క్లబ్, రోటరీ క్లబ్, వాసవి క్లబ్ ప్రతినిధులను సమావేశానికి ఆహ్వానించినట్టు తెలిపారు. శ్మశానవాటికలో ఏర్పాటు చేయాల్సిన వసతులు, దహన సంస్కారాలకు వచ్చిన ప్రజలు వేచి ఉండేందుకు షెల్టర్స్ నిర్మాణం, నీటి సదుపాయం, మెయిన్ రోడ్ నుంచి శ్మశానవాటిక వరకూ రోడ్డు నిర్మాణం తదితర ఏర్పాట్లపై ఈ సమావేశంలో చర్చిస్తామని చెప్పారు.

వారాహీదేవిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ



వారాహీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న దేవీచౌక్ కనకదుర్గమ్మ

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మ బుధవారం వారాహీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పవిత్ర ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ అమ్మవారిని వారాహీదేవిగా అలంకరించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఏలేశ్వరం: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ కిషోర్‌బాబు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బోను రామకృష్ణ అధ్యక్షతన బుధవారం డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. కృషి, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ఎస్సై జి.సతీష్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. డ్రగ్స్ నియంత్రణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు కేశవరావు, రఘురామ్, ఉషామాధురి, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువత వ్యసనాల బారిన పడవద్దు



జగ్గంపేట డిగ్రీ కళాశాలకు ప్రాజెక్టర్ బహూకరిస్తున్న సీఐ సూర్య అప్పారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై సతీష్

జగ్గంపేట: యువత చెడు వ్యసనాల బారిన పడవద్దని జగ్గంపేట సీఐ సూర్య అప్పారావు సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి, మద్యం ప్రభావం యువతపై ఎక్కువ ఉందన్నారు. కొంతమంది యువతను మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారుస్తున్నారన్నారు. యువత తమ శక్తి సామర్థ్యాలను భవిష్యత్ కోసం వినియోగించి లక్ష్యసాధనకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సీఐ సూర్య అప్పారావు ఎల్‌సీడీ ప్రాజెక్టర్ బహూకరించారు. విద్యార్థులకు పలు అంశాలపై టాలెంట్ టెస్టు పెట్టి విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రనాయుడు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ విజయానికి సమష్టిగా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీల సంఘ అధ్యక్షుడు హనుమంతురావు

రౌతులపూడి: మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేసి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మేకల హనుమంతురావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం సంక్షేమాభివృద్ధి దిశగా పరుగులు తీస్తోందన్నారు. ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి(బుజ్జి), జిల్లా ఎంపీపీల సంఘ మహిళాధ్యక్షురాలు జోత్స్న, సామర్లకోట ఎంపీపీ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లగుడు శ్రీనివాసు

కోటనందూరు: అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు ఆదేశించారు. మండలంలోని ఇండుగపల్లిలో బుధవారం జగనన్న సురక్ష పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అర్హతలు ఉండి గతంలో పథకాలు పొందని వారికి పథకాలు వర్తింపజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. గ్రామ వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలకు అర్హులను గుర్తించాలన్నారు. లబ్ధిదారులకు అవసరమైన ధ్రువపత్రాలను ప్రభుత్వం ఉచితంగా మంజూరు చేస్తుందన్నారు. మండల ఎంఎల్‌ఓ నూతన ప్రసాద్ సురక్ష పథకం విధివిధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచులు కుంచే సత్యవతి, సుర్ల రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు కుంచే అచ్చిరాజు, పంచాయతీ కార్యదర్శి రావాడ రామచంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సచివాలయాల్లో ఉచిత సేవలు

తుని: జగనన్న సురక్ష పథకంలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రజలకు పలు ధ్రువపత్రాలను ఉచితంగా అందజేస్తామని కమిషనర్ ప్రసాదరాజు బుధవారం తెలిపారు. ఈ నెల 23 నుంచి నెల రోజుల పాటు ఈ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. విద్యార్థులకు సంబంధించి కుల, నివాస, ఆదాయ, డీటీటీ, మ్యూటేషన్ ఫర్ ట్రానాక్షన్, ఆధార్ కార్డుకు మొబైల్ నంబర్ అనుసంధానం తదితర సేవలు ఉచితంగా పొందవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న సెంట్రల్ బ్యాంకు బ్రాంచి మేనేజర్ మోహన్‌రంగా



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీవెంకటప్రసాద్ తదితరులు

గోకవరం: బ్యాంకింగ్, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో గోకవరం ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో బ్రాంచి మేనేజర్ ఆర్.ఆనంద్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ జిల్లా పరిషత్ హైస్కూళ్లకు చెందిన 9వ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరిలో మొదటి రెండు స్థానాల్లో కామరాజుపేట విద్యార్థులు, మూడో స్థానంలో రంపయర్రంపాలెం విద్యార్థి నిలిచారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు చొప్పున నగదు బహుమతులు జమ చేస్తామని బ్రాంచి మేనేజర్ ఆనంద్ తెలిపారు. విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బి.గౌరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

రౌతులపూడి: రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆర్థిక సహకారంతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కోళ్ల రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం మండలస్థాయి క్విజ్‌పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు కర్రి యశ్వంత్, కర్రి గంగాధర్ విజేతలుగా నిలిచారు. ద్వితీయ బహుమతిని ములగపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు, తృతీయ బహుమతిని బలరామపురం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు గెలుచుకున్నారు. విజేతలకు స్థానిక సెంట్రల్ బ్యాంకు బ్రాంచి మేనేజర్ మోహన్‌రంగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాకినాడ సిటీ: జీ-20 ఈవెంట్లలో భాగంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) జాతీయ స్థాయిలో ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తోందని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ చందాల శ్రీవెంకట ప్రసాద్ తెలిపారు. ఈ పోటీల్లో భాగంగా బుధవారం జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో జిల్లా లీడ్ బ్యాంక్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మండల స్థాయి పోటీలను నిర్వహించినట్టు తెలిపారు. ఈనెల 28న జిల్లా స్థాయిలో ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు శ్రీవెంకటప్రసాద్ తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి వద్దకే వైద్య సేవలు

కోటనందూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానంతో రోగుల ఇంటి వద్దకే వైద్య సేవలు అందుతున్నాయని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఇందిరాప్రియదర్శిని అన్నారు. కోటనందూరులో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ ఇందిరాప్రియదర్శిని ఇంటింటికీ వెళ్లి రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సీజనల్ రోగాలకు దూరంగా ఉండాలంటే ఇళ్ల మధ్య నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రాజమణి, ఎంపీహెచ్ఈఓ మురళీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు



బంగారయ్యపేట వద్ద క్వారీ లారీలను నిలిపివేసిన గ్రామస్తులు

రౌతులపూడి: కత్తిపూడి- రౌతులపూడి రహదారిపై బంగారయ్యపేట వద్ద బుధవారం జరిగిన ప్రమాదంలో ఓ మహిళకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. బంగారయ్యపేట గ్రామానికి చెందిన కరగాని లోవతల్లి బుధవారం తెల్లవారుజామున బహిర్భూమి కోసం ఏలేరు కాలువ వైపు తన కుమార్తె కొల్లుమేని వరలక్ష్మితో కలిసి వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని క్వారీ లారీ ఢీకొట్టి వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన లోవతల్లిని కుటుంబ సభ్యులు రౌతులపూడి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. దీంతో ఆ రహదారిలో రవాణా సాగిస్తున్న క్వారీ లారీలను గ్రామస్తులు నిలిపివేశారు. లోవతల్లిని ఢీకొట్టిన క్వారీ లారీ ఆచూకీ తెలిపి తమకు న్యాయం చేసే వరకూ లారీలను వదిలిపెట్టమని స్థానికులు తెలిపారు.

ఎంపీపీని కలిసిన ఎంఈఓ-2 రామశేఖర్

కోటనందూరు: మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ)-2గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రామశేఖర్ బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసును మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీపీకి పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని, జగనన్న గోరుముద్ద అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సకాలంలో సర్టిఫికెట్ల బట్వాడా

గండేపల్లి: మండలంలోని విద్యార్థులకు ఆదాయ, కుల, నివాస తదితర సర్టిఫికెట్లను సకాలంలో అందజేస్తానని ఉప తహసీల్దార్ సీహెచ్ దివ్యభారతి తెలిపారు. గండేపల్లి ఉప తహసీల్దార్‌గా ఇటీవల ఆమె బాధ్యతలు స్వీకరించారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానన్నారు. కాగా ఆమె గోకవరం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. గండేపల్లి ఉప తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన సరిత అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీపై వెళ్లారు.

ఆరోగ్య యోగం.. ఆనందమయం



తుని శ్రీప్రకాష్‌లో యోగాసనాలతో అలరించిన విద్యార్థులు



ప్రత్తిపాడు కోర్టు ప్రాంగణంలో యోగాసనాలు వేస్తున్న న్యాయమూర్తి కాటం భాను తదితరులు



పెరుమాళ్లపురం డిగ్రీ కళాశాలలో యోగా గురువు సత్యనారాయణను సత్కరిస్తున్న అధ్యాపకులు



ఏలేశ్వరంలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం

- ఉత్సాహంగా ప్రపంచ యోగా దినోత్సవం
- గ్రామాల్లో అవగాహన సదస్సులు
- యోగాసనాలతో అలరించిన విద్యార్థులు

తుని: ప్రపంచ యోగా దినోత్సవాన్ని తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని ప్రజలకు స్వచ్ఛంద సంస్థలు, యోగాశ్రమాల ఆధ్వర్యంలో యోగాసాధనపై అవగాహన కల్పించారు. యోగా శిక్షణ మందిరాల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. తుని పట్టణంలో యోగా గురువు మూర్తి యోగాసనాల ప్రాముఖ్యతను వివరించారు. భారత్ వికాస్ పరిషత్, వాకర్స్ క్లబ్, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ తదితర సంస్థల్లో వేడుకలు నిర్వహించారు. స్థానిక దివాణం వీధిలోని ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ భవనంలో చిన్నారులకు యోగా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.

శ్రీప్రకాష్‌లో..

తుని శ్రీప్రకాష్ విద్యాసంస్థలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలు అందరినీ అలరించాయి.

ఏలేశ్వరం: ప్రపంచ యోగా దినోత్సవాన్ని నియోజకవర్గవ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో యోగా సాధన చేశారు. స్థానిక సాయిబాబా మెట్ట వైఆర్‌పీ అతిథిగృహం వద్ద యోగా సాధన కమిటీ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ల్లో యోగాసనాలు వేశారు. యోగా చేయడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో శేషగిరి పట్నాయక్, ప్రసాద్, పూర గంగ తదితరులు పాల్గొన్నారు

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

కోటనందూరు: యోగా సాధన చేయడం ద్వారా మానసిక, శారీరక స్థైర్యం లభిస్తుందని యోగా గురువు బంటుపల్లి అచ్చారావు అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం కోటనందూరులో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా అచ్చారావు మాట్లాడుతూ యోగాతో ఎన్నో రుగ్మతలకు పరిష్కారం లభిస్తుందన్నారు. విద్యార్థులు యోగాను దినచర్యలో భాగంగా చేసుకోవాలని సూచించారు. యోగాలో మెలకువలను చిన్నారులకు నేర్పించారు.

ప్రత్తిపాడు: యోగాతో మానసిక, శారీరక వికాసం సాధ్యపడుతుందని ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కాటం భాను అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక యోగా తరగతులు నిర్వహించారు. కోర్టు ప్యానెల్ అడ్వకేట్ బుగత శివ, ఏగి రామకృష్ణ, మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ బాధ్యురాలు శ్రీలక్ష్మి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. స్వామి వివేకానంద పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక నరేంద్రగిరిపై యోగా తరగతులు నిర్వహించారు.

తొండంగి: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని అన్నవరానికి చెందిన యోగా గురువు జి.సత్యనారాయణ అన్నారు. పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ విద్యార్థులతో పలు యోగాసనాలు వేయించి వాటి ప్రాధాన్యతను వివరించారు. అనంతరం ఆయనను కళాశాల ప్రిన్సిపాల్ మెహర్, ఇతర అధ్యాపక బృందం, విద్యార్థులు శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ దివాకర్, అధ్యాపకులు జాన్ కిరణ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గంపేట: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని జగ్గంపేట సీఐ సూర్య అప్పారావు అన్నారు. స్థానిక క్షత్రియ కల్యాణ మండపంలో బుధవారం ప్రపంచ యోగా దినోత్సవం నిర్వహించారు. స్థానిక సాహితీ పబ్లిక్ స్కూల్‌లో బీజేపీ జగ్గంపేట నియోజకవర్గ కన్వీనర్ దాట్ల కృష్ణ వర్మ ఆధ్వర్యంలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. గుర్రంపాలెం పంచాయతీ సెక్రటరీ తోట దేవి ఆధ్వర్యంలో యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు.

27న కౌలు వేలం

గోకవరం: రంపయర్రంపాలెంలో సుందరమ్మ సత్రం భూములకు ఈ నెల 27న బహిరంగ కౌలు వేలం నిర్వహించనున్నట్టు సత్రం ఈఓ ముమ్మన రాంబాబురెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని సర్వే నంబర్ 411 పార్టులోని ఆరు బిట్లుగా ఉన్న మొత్తం 67.56 ఎకరాల భూమికి 2023-24 నుంచి 2028-29 వరకు ఆరు సంవత్సరాల కాల పరిమితికి ఈ కౌలు వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 27న ఉదయం 10 గంటలకు గోకవరంలో టెండర్, కౌలు వేలం నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు నిర్ణీత డిపాజిట్ చెల్లించి టెండరు దాఖలు చేయవచ్చన్నారు. పాట పాడుకున్న వారు శిస్తు మొత్తం తక్షణమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 89850 71835 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.